


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### "హేయ్! పరుగులు తియ్యాలి..."

**ఎన్నో ఆనందాలు** మనకి కనుమరుగైపోతున్నాయి. చిన్నప్పుడు కారు ఎవరింటికైనా వస్తే, దాని చుట్టూ మూగి మా పిల్ల మూక, ఆ అద్దాలకి మొహాలు ఆనించి, లోపల ఒక్కసారి కూర్చుంటే ఎలా వుంటుందో అనుకునేవాళ్ళం.

మా అమ్మ ఆర్.టీ.సీలో జాబ్ చేస్తుంది కాబట్టి ఎప్పుడైనా చుట్టాలొస్తే కారు బుక్ చేసి హైదరాబాద్‌లో నౌబత్ పహాడ్ (ఇప్పటి బిర్లామందిర్) గోల్కొండా, చార్‌మినార్, సాలార్‌జంగ్ మ్యూజియంకి తీసుకెళ్తే, అందులో బస్తాలో కూరేసిన కూరగాయల్లా పన్నెండు మంది ఒకరి మీద ఒకరం సర్దుకునే వాళ్ళం.

కానీ కారు వీధిలోకి వస్తే మా లెవెల్ పెరిగిపోయేది. అలాంటి కారు ప్రయాణం సరదా మళ్ళీ వస్తుందా? ఇప్పుడు వాకింగ్‌లకి కూడా కారులో వెళ్ళి, పార్క్ దగ్గర పార్క్ చేసి, నడిచి వస్తాం. అసలు కాళ్ళతో నడవడమే మానేసాం. వీడికన్నా పెద్ద కారు వాడు కొనాలీ, వాడికన్నా ఖరీదైన కారు పక్కవాడు కొనాలి. అసలు కారు లోనులూ,ఈ ఎం ఐలూ కట్టుకోడంతోనే పాపం ఈ తరం వాళ్ళ జీవితాలు నడుస్తున్నాయి.

జీవితాల్లో వేగం పెరిగింది. స్థిమితం తగ్గింది. ఆఖరికి కూర తరగడం కూడా. సావకాశంగా కత్తిపీట ముందేసుకుని, హరిగోవింద నామాలు పాడుకుంటూ "దిక్కెవరయ్యేరే స్వామీ" అంటూ తోటకూర తరిగి ఆనక పులుసుకూర వండినా, వంకాయలు తరిగి వాటిని కారం పెట్టి చేసినా, హరి నామాలు జీర్ణం చేసుకుని, రుచిగా తయారయ్యేవి పదార్థాలు.

అసలు రోట్లో కందిపచ్చడి రుబ్బుతూ, గోడ దగ్గర నిలబడి వాళ్ళ బుజ్జిగాడికి అన్నం తినిపిస్తున్న పక్కింటావిడతో కబుర్లు చెప్తుంటే, ఇంగువా, ఎర్రమిరపకాయలూ, జీలకర్రతో నలుగుతున్న కందిపచ్చడి ఎంత పసందుగా వుండేదీ?

"ఏం వండారు వదినా?"

"ఇదిగో కందిపచ్చడి రుబ్బేసి, వంకాయ పులుసు పచ్చడి చేసేస్తా.. నువ్వో?"

"పొద్దుట పిల్లల బడికి టైం అయిపోతుంటే నాలుగు అరటికాయలుంటే వేయించి బాక్స్‌లు కట్టేసానా! ఈయన మధ్యాహ్నం వచ్చేసరికి తోటకూర కందిపప్పూ కూరచేసి, అరటి దూట పెరుగు పచ్చడి చేస్తా వదినా" ఇలా సాగేవి కబుర్లు.

"ఆ గాజుల మలారం కిష్టప్ప వచ్చాడా? పండగొస్తోందీ?"

"ఆదివారం కాకుండా చూసి రమ్మన్నాను వదినా మగవాళ్ళు ఇంట్లో వుంటారని."

"గద్వాల చీరలు తెచ్చే గవర్రాజు పండగకి కొత్త చీరలు తెస్తాడేమోగా?"

"ఔను వదినా, జరీ చీరలతోబాటు నూలు చీరలు కూడా తెమ్మన్నాను."

"ఆ మూలింటి వాళ్ళకోడలు ఆస్పత్రిలో కనిపించింది. నీళ్ళోసుకుందా?"

"అదే అయ్యుంటుంది వాళ్ళత్తగారు గోంగూర పులుసు కోసం ఆకు కోసుకెళ్ళింది మొన్న."

వేంవరం వాళ్ళ బాబ్జీ టెంత్ పాసయ్యాడా?"

"ఏమో వదినా, సాయంత్రం అయ్యేసరికి బాట్ పుచ్చుకొచ్చేసేవాడు. కనపడడం లేదు."

"మంగరాజుగారి అమ్మాయి శ్యామలాంబగారి అబ్బాయితో మీ జామ చెట్టుకింద నిన్న తెగవూసులాడ్తోంది."

"అలాగా! మరి మంగరాజుగారి పెళ్ళాం ఏమో మేనరికమే చేస్తాం అంటోందే? అయినా నాకెందుకులేమ్మా అసలే నోరు ఎక్కువ. మనం ఏమన్నా అంటే మనమీద పడుతుంది గయ్యాళి గంప."

"సర్లే.. నా పచ్చడి నలిగింది. లోపలికి వెళ్తున్నా."

"ఇదిగో బుజ్జిగాడి మూతి కూడా ఎండిపోయింది వదినా!"

ఇద్దరి సంభాషణలో కందిపచ్చడి భలే పసందుగా కారంగా తయారయ్యేది. మొత్తం పేటలో వాళ్ళ విశేషాలూ వార్తలు కూడా ఆ పూట పూర్తయ్యేవి.

అంటే మన టీవీల్లో గంట గంటకీ వచ్చే న్యూస్ బులెటిన్స్‌లా అన్నమాట.

సాయంత్రాలు మేం పిల్లలుగా వున్నప్పుడు ఎవరింట్లో సన్నాజాజి మొగ్గలు విచ్చాయో, మల్లె పొదలున్నాయో చూసి గుంపుగా వెళ్ళి తెంపుకొచ్చి, మాలలు కట్టి పక్కింటి పిన్నిగార్లకీ, అత్తయ్యగార్లకీ ఇచ్చి మేం పెట్టుకునే వాళ్ళం. ఏ సందులోకి వెళ్ళినా, ఆడపిల్లల తలల్లో మల్లెపూలు గుప్పుమంటుండేవి.

సందె చీకటి పడుతుంటే, ఆడుకుని ఆడుకుని ఆయాసంతో ఇంటికి నడిచి వస్తుంటే, ఎవరింట్లోంచో రేడియోలో "తెరిచి వుంచేవు సుమా త్వరపడి నీ తలుపులూ" అన్నపాట వినిపిస్తుంటే అక్కడే ఆగి వినేవాళ్ళం.

ఆపాట రేడియోలో మళ్ళీ ఎప్పుడొస్తుందా అని ఎదురు చూసేవాళ్ళం.

దూరదర్శన్‌లో సోమవారం నాడు చిత్రమాల అంటూ ఓ అస్సామీ పాటా, ఒరియా పాటా, వేసాక తెలుగు పాట వేస్తాడని ఆశగా చుసేవాళ్ళం. ఓవేళ వేసినా అది ఓ ఆర్ట్ ఫిలంలో పాటేదో చీకట్లో అమ్మాయి జుట్టూ, నీడా కనిపించే పాట వేసేవాడు. గురువారం చిత్రలహరి కోసం ఆరాటం. శనివారం హిందీ సినిమా, ఆదివారం తెలుగు సినిమా. హాయిగా చుట్టూ చుట్టాలతో కలిసి కూర్చుని చూసిన ఆ బ్లాక్ అండ్ వైట్ సినిమాల అనుభూతి ఎలా మరచిపోగలం?

కులాసాగా తీరుబడిగా ఏ వేరుశనగ గుళ్ళో వలుచుకు తింటూ హాయిగా నవ్వుతూ, ఆస్వాదిస్తూ సినిమా చూసే వాళ్ళు పెద్ద వాళ్ళు సైతం.

ఇప్పుడు టి.వీ పెట్టారు. మొబైల్ చెవిలో పెట్టారు.

"జయా ఏం చేస్తున్నావ్? మీ ఆయనొచ్చారా ఆఫీస్ నుండీ? అమ్మ సచ్చినోడా అప్పుడే ఏం తొందర రా."

జయా.. నిన్ను కాదే, సినిమాలో ఆ విలన్ సచ్చినోడిని... కబుర్లేవిటి చెప్పు.. నాలుగు పేట్ల గొలుసు చేయించుకున్నావా? నీకు బలిసిందే, రేపో మాపో నీ పాపం పండుతుంది.."

"అయ్యో జయా నిన్ను కాదే. ఎదురుగా టీవీలో" ఇలా మొబైల్ చెవిలో పెట్టుకునే ప్రతి పనీ.

చివరకి కూరగాయలు కొనేటప్పుడు కూడా "గోరు చిక్కుడు లేతగా వుందా? నువ్వు రేపు సాయంత్రం ఖాళీగా వుంటే సినిమాకి వెళ్దామా?"

కూరగాయల బండివాడు ఆశగా చూసి "ఆరింటికి ఫ్రీ అయిపోతాను"

ఆవిడ "ఏంట్రా వేషాలేస్తున్నావ్? నిన్ను అనుకున్నావా? నా ఫ్రెండ్‌తో మాట్లాడుతున్నాను. చెవిలో ఇయర్ పాడ్స్ కనిపించటంలేదా?"

"లేదండి – నన్నే అనుకున్నాను."

"అనుకుంటావు.. ఎందుకనుకోవూ? .. ఆగు ఇక్కడ కాదు. రేపు ఈయన కాంప్‌కి వెళ్తున్నారు. ఇంటికి రా."

కూరగాయలవాడు మళ్ళీ ఆశగా చూస్తాడు.

"రమ్మంటారా? ఈ పాలి నన్నేనా?"

"ఏంట్రా? ఒళ్ళు తిమ్మిరెక్కిందా? నా ఫ్రెండ్ వకుళతో మాట్లాడుతున్నా."

"సర్లెమ్మా ఆవిడ రాకపోతే నాకు చెప్పండి"

"ఏంటీ? చెప్పు తెగుతుంది."

వాడి తప్పేం వుందీ? ఈవిడ ఫోన్ కూరగాయలు కొనేటప్పుడుకూడా తప్పదాయె.

మొన్న ఓ సత్యనారాయణ వ్రతానికి వెళ్ళాం. అందరూ తలలు వంచుకుని ఏకాగ్రతతగా ఫోన్స్‌లోనే వున్నారు. ఆ పురోహితుడు పాపం కథ చెప్పుకుంటున్నాడు.

ఒకావిడ పలకరించింది నన్ను.

"మీ పిల్లలు రాలేదా?" అడిగాను.

"వచ్చారు మేడం. ఆ టెంపుల్ రన్ ఆడ్తున్న చుక్కల గౌన్ చిన్నది, టిక్ టాక్ కోసం ఫోన్‌లో చూసి స్టెప్పులేస్తున్నది పెద్దది. యూ ట్యూబ్‌లో న్యూస్ పెద్దగా వింటున్నాయన మా మామగారు.

సోనీ ఏప్‌లో సాయిబాబా సీరియల్ చూస్తున్నావిడ మా అత్తగారు.

అక్కడ దూరంగా సిగ్నల్స్ అందక అంగదుడిలా పెద్ద పెద్ద అంగలేస్తూ అటూ ఇటూ పచార్లు చేస్తున్నది మా ఆయనే. మీటింగ్‌లో వున్నారు."

"బావుంది. మరి మీ సెల్ ఎక్కడా?"

"వ్లాగ్ చేస్తున్నా మీతో మాట్లాడడం.అదిగో ఎదురుగా ట్రైపాడ్ మీదుంది" అంది.

ఎవరి సెల్ గోలలో వాళ్ళుంటే బ్రాహ్మడు అక్షింతలు ఇవ్వగానే మెకానికల్‌గా జల్లారు.

అవన్నీ పాపం ఆయన బోడి బుర్రమీదే పడ్డాయి. అలాగే ఫోన్స్‌లో వుండే చేతులు జాపి తీర్థం ప్రసాదం అందుకున్నారు. అలా వ్రతానికొచ్చి తమ లోకంలో తాము వున్నారు.

ఒక్కసారిగా వైఫై పోతే బావుండు కనీసం స్వామిని కళ్ళారా చూసి దణ్ణం పెట్టుకుంటారనిపించింది.

చాలాసార్లు అనిపిస్తుంది. ఆకాశంలో విమానం చూడ్డానికి పరిగెత్తే అమాయకపు రోజులు ఎంత బాగుండేవీ? ప్రతి ఊరుకీ ఫ్లయిట్‌లోనే వెళ్ళి వెళ్ళి ఆ థ్రిల్ పోయింది. మనిషికి బస్సూ, రైలూ ఎక్కి విశ్రాంతిగా ప్రయాణం చేసే టైం కూడాలేదు.

హడావిడి, ప్రతి పనీ హడావిడిగానే, అంతే హడావిడిగా పెళ్ళిళ్ళు చేసుకుంటున్నారు. పడకపోతే విడిపోతున్నారు.

కమ్యునికేషన్ ఫాస్ట్.. అరసెకనులో "ఐ యాం లీవింగ్ యూ.. వి ఆర్ నాట్ కంపేటిబుల్" అని టైప్ చెయ్యచ్చు. బ్లింకెట్‌లోలాగా, కనురెప్ప ఆర్పేలోగా అతగాడికీ మెసేజ్ చేరి, హడావిడిగా లాయర్ నెంబర్ కోసం ఫోన్‌లో వెదుకుతూ కనిపిస్తాడు. అంతా ఫాస్ట్... పాస్ట్... టూ మినిట్స్ జిప్టో.. త్రీ మినిట్స్ బ్లింకిట్... ఏదైనా అంతే.




Post your comments

